మినీ కథ

# వీళ్ళు మారారా?

"ఏమండి మా అమ్మ ఉత్తరము రాసిందండి" అంది నా శ్రీమతి, ఆఫీసునుంచి వచ్చిన నాతో.

"ఏమని రాసారు" అన్నాను.

"సంక్రాంతికి రమ్మని" అంది నవ్వుతూ.

"సర్లే పదిరోజులు టైము ఉందికదా! అప్పుడు ఆలోచిద్దాము కాఫీ పట్రా" అన్నాను.

మాకు పెళ్లైయి మూడు సంవత్సరములు కావస్తూంది. పిల్లలు లేరు. ఈ మూడేళ్ళలో మేము అత్తగారింటికి వెళ్ళడము ముచ్చటగా మూడుసార్లు మాత్రమే. మాది మధ్య తరగతి కుటుంబమే, వాళ్ళది మధ్య తరగతి కుటుంబమే, మేము వెళ్ళామని అప్పో, సప్పో చేసి ఉన్న నాలుగురోజులు గొప్పగా చూస్తారు. తర్వాత వాళ్ళు ఇబ్బంది పడతారు. "జామాతా దశమ గ్రహ" అన్నారు పెద్దలు. ఇలా కాకూడదనే నాకు వెళ్ళ బుద్ధికాదు.

"ఏమిటండి అంత పరధ్యానము" అంది కాఫీ తెస్తూ.

"ఆహాఁ ఏమి లేదు. నువు కొంగు బొడ్లోకి దోపి నిల్చుంటే సత్యభామ గుర్తుకు వస్తుంది" అన్నాను కాఫీ తీసుకొని నవ్వుతూ.

"వర్ణలకు ఏమి లోటు లేదు" అని నవ్వేసి "ఏమండి మొన్న దీపావళికీ వెళ్ళలేదు. ఈసారి తప్పకుండ వెళ్ళదామండి" అంది.

చూడు పద్మా! మనకి పండుగే వాళ్ళకి పండుగే. మనం వాళ్ళింటికి వెళ్ళి వాళ్ళను ఇబ్బంది పెట్టేకన్నా, ఇక్కడే మనం ఉన్నంతలో తృప్తిపడదాము ఏమంటావు? అన్నాను అనునయంగా,

"మీరు చెప్పింది బాగానే ఉంది. కాని మా అమ్మోళ్ళు మరోక విధంగా అర్థము చేసుకుంటారు. ఐనా మనం వెళ్ళి సంవత్సరానికిపైనే అయ్యింది కదండి" అంది.

చేసే ఉద్యోగము ప్రవేయిటు కంపెనీలో వాళ్లు అర్థరాత్రికి రమ్మన్నా తప్పక వెళ్లాలి. విజయవాడనుంచి యలమంచిలి వెళ్ళి నాలుగు రోజులైన ఉండక తప్పదు. సెలవు ఇస్తారో, ఇవ్వరో అనుకొని—

"సర్లే వీలుచూసుకొని వెళదాము. కాని నువు ముందుగా ఉత్తరము రాయకు" అన్నాను.

మనసులో ఏమనుకుందో తలాడించింది. "పార్కుకు వెళదాము బేగా రడీ అవు" అన్నాను. "అలాగే" అంటూ వంటగదిలోకి వెళ్ళింది నా శ్రీమతి.

* * *

ఆఫీసర్ ఏమూడ్‌లో ఉన్నాడో గాని అడిగిన వెంటనే సెలవు మంజూరు చేశాడు.

పండగ రెండురోజు లనగా అనుకున్న బండికి బయల్దేరి యలమంచిలిలో దిగి, రిక్షా బేరమాడి మా అత్తగారి వీధిలో దిగాము. మా అత్తగారిల్లు సంధులో ఉంది. సంధులు దాటుకుంటూ నడుస్తున్నాము. ఇల్లు దగ్గిర పడింది ఇంతలో—

"మా ఇద్దరు అల్లుళ్ళు అయితే వచ్చేశారు గాని, మా విజయవాడ అల్లుడు మాత్రము రాడు. అబ్బో అతనిని పట్టుకోగలమా? ఏదో నా కూతురు కాబట్టి ముద్దుముచ్చటలేని మొగుడుతో కాపరం చేస్తుంది కాని మరియొకతె చెయ్యగలదా?" అంటుంది, మా అత్త ఎవరితోనో, ఇంటి ప్రక్క సందులో నిల్చుని.

ఇది మా కంట బడింది. నా అవస్థ గమనించి మీరేమి అనుకోవద్దు అన్నట్టు మొఖం దీనంగా పెట్టింది నా శ్రీమతి. అప్పుడు అనుకున్నాను "వీళ్లుమారారా?" అని.

—భీశెట్టి రామకృష్ణ.